క్లుప్తంగా

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



ధర్పల్లి: వేసవి దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన తాగునీటి నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించారు. పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు ధర్మేందర్, దామోదర్, ఏపీవో రాజేష్ ఉన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

ఇందల్వాయి: రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని, ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇందల్వాయి ఎస్సై మనోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులను ఆయన అప్రమత్తం చేశారు. జాతీయ రహదారులు, ఇతర ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబోసి కుప్పలు పోసి బండరాళ్లను పెట్టడం వల్ల వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాత్రి వేళల్లో వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు.

ఏఐపీఎస్‌యూలో చేరిక



నిజామాబాద్‌నాగారం: ఎస్‌ఎఫ్‌ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) విద్యార్థి సంఘం నాయకులు పలువురు సోమవారం ఏఐపీఎస్‌యూ(ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్)లో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్షుడు మన్నెకుమార్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం కండువాలు కప్పి ఏఐపీఎస్‌యూలోకి ఆహ్వానించారు. అనంతరం మన్నె కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యారంగ వ్యతిరేఖ విధానాలను అవలంభిస్తోందని, రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. బోడ అనిల్, సందీప్, సాయికుమార్, సురేష్, శ్రీరామ్, సునీల్, సుశాంత్, నవీన్, శివ, అంకుష్, ప్రశాంత్, సాయిబాబా, వంశీ, శివాజీ, రాహుల్ ఉన్నారు.

కాన్వొకేషన్ ఫీజులను తగ్గించాలి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల పెంచిన కాన్వొకేషన్ ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు నగరంలోని జీజీ కాలేజ్ ఎదుట తెలంగాణ యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న డిగ్రీ విద్యార్థుల కాన్వకేషన్ ఫీజు రూ.700 నుంచి రూ.3,500కు పెంచడం సరికాదన్నారు. అలాగే ఇతర సర్టిఫికెట్ల రుసుమును పెంచడంతో పేద విద్యార్థులు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు వంశీ, సాయిరాం, కళ్యాణ్, రామ్, రాహుల్, రాజు, సంతోష్, కార్తీక్, వరప్రసాద్, శ్రీకాంత్, మాధవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



డిచ్‌పల్లి: సాంపల్లి మాజీ సర్పంచ్ అంతరెడ్డి మోహన్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మెంట్రాజ్‌పల్లి సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసన్ తదితరులున్నారు.

సిరికొండ: మండలంలోని పోత్నూర్ మాజీ సర్పంచ్ దర్శనం మంజుల కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. డీసీసీ కార్యదర్శి గొల్ల ఎర్రన్న, ఏరా ప్రవీణ్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

రహదారులు ఇలాగేనా?

- గుంతలమయం రోడ్లతో నగరవాసుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు





చంద్రశేఖర్‌కాలనీలో సీసీ రోడ్డుపై తేలిన కంకర.. ఖిల్లా చౌరస్తాలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

కార్పొరేషన్ రిపోర్ట్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని రహదారులు అధ్వానంగా మారాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయం కావడం, మరికొన్ని చోట్ల కంకర తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా వేసిన రోడ్లు కొన్ని, మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో మరికొన్ని రోడ్లు నిర్మించారు. దీంతో ఇరువురి శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. అయినా అధికారులు స్పందించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత లోపమే కారణమా..

నగరంలోని ప్రధాన రహదారులతోపాటు కాలనీల్లో వేసిన సీసీ, తారు రోడ్లల్లో సైతం నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని నగరవాసులు చర్చించుకుంటున్నారు. నగరంలో పలు కాలనీల్లో వేసిన సీసీ, తారు రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటే అన్న పరిస్థితిగా మారింది.

చాలా చోట్ల సీసీ రోడ్లలో కంకర తేలిపోయాయి. కంఠేశ్వర్‌నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు, పూలాంగ్ నుంచి వర్నిరోడ్ వరకు, ఖిల్లా చౌరస్తా, బోధన్ రోడ్‌లల్లో అన్ని ప్రధాన రహదారులపై గుంతలు ఉన్నాయి. గతంలో రోడ్లు వేస్తే పదికాలాల పాటు మన్నికగా ఉండేవి. ప్రస్తుతం రోడ్లు వేసి, నెలలు గడవకముందే పాడైపోతున్నాయి. దీంతో నగర ప్రజలకు ఈ రోడ్లపై నడక నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల ఉన్న గుంతలకు మరమ్మతులు చేసినా పరిస్థితి మాత్రం మారడంలేదని పలువురు పేర్కొంటున్నారు. నగరంలో రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల దగ్గర అధికారులు కమీషన్‌లకు కక్కుర్తి పడడంతోనే పదికాలాల పాటు ఉండాల్సిన రోడ్లు కేవం మూణ్నాళ్ల ముచ్చటగా మారిపోతున్నాయని నగరవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరంలోని రహదారులకు మరమ్మతులు చేపట్టి బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

బూటకపు హామీలతోనే అధికారంలోకి కాంగ్రెస్

- నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



ఇఫ్తార్‌విందులో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్‌రూరల్: అబద్ధపు, బూటకపు హామీలతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మండలంలోని గుండారం గ్రామ మసీదులో సోమవారం రాత్రి ముస్లింల ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో మైనారిటీలకు అత్యధిక నిధులు మంజూరు చేసిన పార్టీ బీఆర్‌ఎస్ అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక అన్ని శాఖలకు మంత్రులను కేటాయించినా, మైనారిటీ శాఖకు మంత్రిని కేటాయించకపోవడం ఎంతో దురదృష్టకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అంతకుముందు ముస్లిం మతపెద్దలు బాజిరెడ్డి ఎంపీగా భారీ మెజారిటీతో గెలవాలని ప్రార్థనలు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు, జెడ్పీటీసీ బొలెక్క సుమలత, గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ అంకాల గంగాధర్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, నాయకులు అక్బర్‌నఋద్దీన్, మీసాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ న్యాయవాదులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ అన్నారు. జిల్లా కోర్టులోని డీఎల్ఎస్ఏ సమావేశ హాల్‌లో సోమవారం బార్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారి ఆముదాల సుదర్శన్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జగన్మోహన్ మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు సహకారాన్ని అందించడం, సెమినార్ నిర్వహించడంతోపాటు అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన కమిటీ బార్ అండ్ బెంచ్ సహకారంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. న్యాయమూర్తులు, కమిటీ సభ్యులు వసంతరావు, రాజు, సురేష్, దీపక్, పిల్లి శ్రీకాంత్, కవిత రెడ్డి, గోవర్ధన్, రాజలింగం, కృపాకర్ రెడ్డి, ఆజార్ కిషన్ రావు, వెంకటేష్, విగ్నేష్, బట్టు మాణిక్ రాజ్, రవి, నీరజారెడ్డి, అరటి నారాయణ, శివాజీ, రజిత పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎస్‌ఎఫ్‌ఐ నుంచి బహిష్కరణ



నిజామాబాద్‌అర్బన్: సంఘ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడిన బోడ అనిల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) నుంచి బహిష్కరించినట్లు జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేష్ తెలిపారు. నగరంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ ఆర్థిక ఆరోపణలు ఎదుర్కోవడం, సంఘం నిబంధనలను అతిక్రమించడంతో ఎస్‌ఎఫ్‌ఐ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ సంఘం నుంచి బహిష్కరించామన్నారు. అనిల్, సాయికుమార్, సందీప్‌కి ఎస్‌ఎఫ్‌ఐతో ఎలాంటి సంబంధం లేదన్నారు. సంఘ ప్రతినిధులు మహేష్, దీపిక, గణేష్, వేణు పాల్గొన్నారు.

నియామకం



నిజామాబాద్‌రూరల్: మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరాటి లింగం, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. నాయకులు సురేష్ నాయక్, మోహన్ నాయక్, రమేష్, నరేష్, ముప్పా గంగారెడ్డి, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

జక్రాన్‌పల్లి: పడకల్ గ్రామంలోని వేంకటేశ్వర ఆలయ హుండీని ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండుగులు ఎత్తుకెళ్లారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎఎస్సై వెంకట్‌కుమార్ ఆలయానికి వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం గ్రామంలో, మోపాల్ మండలంలోని కంజర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పార్టీ ప్రతినిధులు ముప్ప గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, సాయారెడ్డి, ప్రవాణ్ రెడ్డి, అనిల్, గంగారెడ్డి, శ్రీకాంత్, గుడి సుధకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

నిజామాబాద్‌అర్బన్: లోకసభ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉపాధ్యాయ ఉద్యోగుల్లో అనారోగ్య సమస్యలు ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృపాల్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీపీ, మధుమేహం, ఓపెన్ హార్ట్ సర్జరీ వాళ్లకు, కాన్సర్‌తో బాధపడే వారికీ, దివ్యాంగులు, గర్భిణులకు, వృద్ధులకు పూర్తిగా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం ముగిసింది. నగరంలోని నిశిత కామర్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ రాజు, ప్రిన్సిపాల్ జయంత్ పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు సమాజంపై అవగాహన ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, వలంటీర్లు పాల్గొన్నారు.

సమాచారం..

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రొఫెసర్-08, అసోసియేట్ ప్రొఫెసర్-12, అసిస్టెంట్ ప్రొఫెసర్-07, ట్యూటర్-06, సీనియర్ రెసిడెంట్-03 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా పోస్టుల కోసం ఈ నెల 2, 3 తేదీల్లో కళాశాలలో ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 4న మధ్యాహ్నం 12గంటలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.gmcnzb.orgను సంప్రదించాలని ఆమె తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్-1 ఆర్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక నగర్ విద్యుత్ ఉపకేంద్రం ఆర్య నగర్ 1 ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా కరెంట్ కోత ఉంటుందన్నారు. నగరంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ వెనుక గల్లి, లక్ష్మీ వినాయక కాలనీ, వాసవి అపార్ట్‌మెంట్ ఏరియా, సంకట విమోచన గణపతి ఏరియా, గాయత్రీ నగర్, సిద్ధి వినాయక నగర్ గుడి, సాయిప్రియనగర్, విశాల్ మార్ట్ ఏరియా, ఆకుల పాపయ్య రోడ్డు, చంద్రనగర్, గోసం కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమీకృత పోషక యాజమాన్యంపై అవగాహన

డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో మంగళవారం 'సమీకృత పోషక యాజమాన్యం' అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే వ్యవసాయ శాస్త్రవేత్తలు దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు సిరికొండ మండల సమావేశం

సిరికొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 3న (బుధవారం) నిర్వహించనున్నట్లు మండల అధికారి లక్ష్మీప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగీత అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

పాల్దా సొసైటీ చైర్మన్ రాజీనామా



నిజామాబాద్‌రూరల్: మండలంలోని పాల్దా గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గాడి జితేందర్ సోమవారం తమ పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు బైండోవర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇద్దరు పాత నేరస్తులను సోమవారం తహసీల్దార్ రామ లింగేశ్వర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మోపాల్‌కు చెందిన కెంపు సాయిలు, ఎల్లమ్మకుంటకు చెందిన రమేష్‌ను బైండోవర్ చేశామన్నారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం





సిరికొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు.. తూంపల్లిలో..

సిరికొండ: సిరికొండ సొసైటీ పరిధిలోని సిరికొండ, పెద్దవాల్గోట్, కొండూర్, మైలారం, సర్వల్లి తండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం కోఆపరేటివ్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్‌రావు ప్రారంభించారు. తూంపల్లి సొసైటీ పరిధిలో తూంపల్లి, గోప్యతండా, సర్పంచ్ తండాల్లో, హొన్నాజీపేట్ సొసైటీ పరిధిలోని గడ్కోల్‌లో ఏవో వెంకటేష్ ప్రారంభించారు. సీఈవోలు మహ్మద్ అలీ, దేవిలాల్, గంగనర్సయ్య, ఏఈవోలు శ్రీకాంత్, శివాని, సిబ్బంది భూపతిరెడ్డి, రాజారెడ్డి, నీలేష్, గిరిధర్, ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని యానంపల్లి, లింగసముద్రం, సుద్దులం, యానంపల్లి తండ, కొరట్‌పల్లి, కొరట్‌పల్లి తండా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక అధికారులు ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, వైస్ చైర్మన్ గంగారాం, డైరెక్టర్లు దాసరి రాము, అంకం లత, ముత్తెమ్మ, బాలమల్లు సాయిలు, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: పెండింగులో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామపంచాయతీల్లో వేలాదిమంది మల్టీపర్పస్ కార్మికులకు సుమారు 5, 6 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక నిధి, బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. యూనియన్ ప్రతినిధులు సుధాకర్, రాజేశ్వర్, మల్లేష్, మురళి, రమేష్, సాయిలు, రవి, ప్రభాకర్, రాజన్న, లక్ష్మణ్, గంగాధర్, అశోక్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా మహాలక్ష్మీ జన్మదిన వేడుకలు



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి జన్మదిన వేడుకలను సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. రేఖ చంద్రసేన కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం గ్రామంలో భీమయ్య ఆలయ వార్షికోత్సవాలకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై ప్రత్యేక పుజలు నిర్వహించారు. గొల్లగుట్టతండాలో జగదాంబ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో బోగ్ బండార్ నిర్వహించి పూజలు నిర్వహించారు. మల్లారం గ్రామ శివారులోని లింగేశ్వర గుట్టపై గల శివాలయంలో స్వామీజీ పిట్ల కృష్ణ మహరాజ్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మహరాజ్ ఎమ్మెల్యేను సన్మానించారు. ముప్ప గంగారెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, ఎల్లయ్య, అన్నం సాయిలు, గాండ్ల రాంచందర్, సాయరెడ్డి, అన్నం గోపి, రవి, అశోక్, శ్రీనివాస్, అంజయ్య, సాయిలు, నారాయణ పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ ఇఫ్తార్ విందు



సుభాష్‌నగర్: నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో సోమవారం సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి, విందు స్వీకరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారాం, జిల్లా ప్రధానకార్యదర్శి నేతికుంట శేఖర్, కేంద్ర సంఘం సభ్యులు పోల శ్రీనివాస్, జాఫర్, జాకీర్, హుస్సేన్, అన్ని యూనిట్ శాఖల్లోని మైనారిటీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	70,000	వెండి (కిలో)	79,500
22 క్యారెట్స్	64,565	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	30	50	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నుసుకాయ	30	60	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

- సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.35, 7.30, 10.25
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) - 10.45, 1.50, 4.25, 10.25, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 7.30
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 1.15, 7.25, 10.40, కలియుగం పట్టణంలో (తెలుగు) - 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.10, 1.10, 7.50, 10.50, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 4.20
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 12.00, 2.40, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 5.20, 8.00, 10.40
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 12.05, 7.00, రజాకార్ (తెలుగు) - 3.45, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 10.40
స్క్రీన్-4	క్రూ (తెలుగు) - 10.45, 1.35, 7.40, 10.30, ప్రేమలు (తెలుగు) - 4.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు)
లలితామహల్	ఓం భీమ్ బుష్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)